నన్నారి..ఉపాధికి దారి!

- శీతల పానీయానికి భలే గిరాకీ
- నన్నారి పంట సాగుపై రైతుల ఆసక్తి


మామిళ్లపల్లి వద్ద సాగవుతున్న నన్నారి పంట

ధర్మవరం రూరల్: నన్నారి(శీతల పానీయం) మనిషి దాహం తీర్చడమేకాదు పలువురికి ఉపాధిగా మారి పొట్టనింపుతోంది. నన్నారిని విక్రయిస్తూ వ్యాపారులు జీవనం సాగిస్తుండగా మరో వైపు రైతులు నన్నారి పంట సాగుతో ఉపాధి పొందుతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నన్నారి తయారీకి వినియోగించే సుగంధ వేర్ల సాగుపై రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. ఇటీవల కాలంలో 500 ఎకరాలకు పైబడి ఈ పంటను సాగు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

నన్నారి సాగు విధానం..

నన్నారి పంట కోసం వేర్లను మదనపల్లి, కడప ప్రాంతాల నుంచి ఇక్కడి రైతులు తెచ్చుకుంటారు. ఒక్కో మొక్క రూ.5 వెచ్చించి కొనుగోలు చేస్తారు. ఎకరానికి సుమారు 15,000 వేల మొక్కలను నాటుతారు. ఈ పంట కాల పరిమితి రెండున్నరేళ్ల నుంచి మూడేళ్లు ఉంటుంది. ఎకరానికి మూడేళ్లకు కలిపి సుమారు రూ.1.50 లక్షల దాకా పెట్టుబడి వస్తుంది. పంటలో కలుపు తొలగిస్తూ ఉండాలి. పంటకు బాగా నీరు పెట్టాలి. పంట కాలం పూర్తయిన తరువాత నన్నారి వేర్లను జేసీబీతో తిరగబడతారు. జేసీబీతో తిరగబడుతున్నప్పుడు భూమిలో ఉన్న నన్నారి వేర్లు బయటపడతాయి. వాటిని కూలీల ద్వారా పక్కకు వేయిస్తారు. మొక్క నుంచి వేర్లను కత్తిరిస్తారు. వేర్లు బాగా ఊరితే ఎకరానికి 3 టన్నుల నుంచి మూడున్నర టన్నుల దాకా దిగుబడి వస్తుందని రైతులు అంటున్నారు.

మార్కెట్‌లో ధరలు ఎలా ఉన్నాయంటే..

రెండేళ్ల క్రితం వరకు నన్నారి వేర్లను టన్ను రూ.3 లక్షల దాకా వెచ్చించి కొనుగోలు చేసేవారు. ఈ ప్రాంతానికి మదనపల్లి, కడప ప్రాంతాల నుంచి వ్యాపారులు వచ్చి కొనుగోలు చేస్తుంటారు. ప్రస్తుతం మార్కెట్‌లో టన్ను రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షలు పలుకుతోందని రైతులు చెబుతున్నారు.

నన్నారి తయారీ ఇలా..

నన్నారి వేర్లను బాగా ఉడికిస్తారు. సుమారు ఐదు గంటల పాటు వేర్లను బాగా ఉడికిస్తే వాటి నుంచే వచ్చే పానీయం మధురంగా ఉంటుంది. ఒక కేజీ వేర్లను బాగా ఉడకబెడితే 10 లీటర్ల నన్నారి వస్తుంది. ధర్మవరంలో సుమారు 70 కుటుంబాలకు పైగా నన్నారి విక్రయాలపై జీవనం సాగిస్తున్నారు. నోరూరించే రుచి, సువాసనతో ఉండే నన్నారి శరీరంలో అధిక ఉష్ణోగ్రతను తగ్గిస్తుంది. మూత్ర సంబంధిత సమస్యలు మందుగా పనిచేస్తుందని వైద్య నిపుణులు అంటున్నారు. శరీరంలో వ్యాధి నిరోధక శక్తిని పెంచడంతోపాటు హార్మోన్ల సమతుల్యతను పెంపొందిస్తుందని చెబుతున్నారు. జీర్ణ ప్రక్రియ, శరీర బరువు నియంత్రణకు ఉపకరిస్తుందంటున్నారు.

ఐదు దశాబ్దాలుగా..



ధర్మవరంలో 1975 నుంచి నన్నారిని విక్రయిస్తున్నా. పాత బస్టాండ్‌లో పీఎస్‌ఆర్ నన్నారి షాపు అంటే ఎవరైనా చెబుతారు. నేను నన్నారి వేర్లను కడప ప్రాంతం నుంచి తెప్పిస్తా. కేజీ రూ.700 చొప్పున వారే వచ్చి ఇక్కడ డెలివరీ ఇస్తారు. నన్నారిని తయారు చేసి లీటర్ బాటిల్‌ను రూ.200 దాకా విక్రయిస్తుంటా. ఇతర రాష్ట్రాల్లో ఉన్న వారు కూడా సెలవులకు వచ్చినప్పుడు నన్నారిని తీసుకెళ్తుంటారు. చాలా మందికి కొరియర్ ద్వారా పంపుతుంటాం.

– షౌఖత్ వలి, పీఎస్‌ఆర్ నన్నారి షాపు యజమాని, ధర్మవరం

పదెకరాల్లో పంట సాగు



నేను పది ఎకరాలలో నన్నారి పంటను సాగు చేస్తున్నాను. మదనపల్లి వాసుల ద్వారా నన్నారి వేర్లను తెచ్చి వారి సలహాలు, సూచనల మేరకు పంటను సాగు చేస్తున్నా. ప్రస్తుతం పంట సాగు చేసి రెండేళ్లయింది. సాగు చేసిన పంటను మదనపల్లి వారే కొనుగోలు చేసి తీసుకెళ్లతామంటున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో ధరలు ఆశాజనకంగా లేకపోవడంతో పంటను తొలగించలేదు. ధరలు పుంజుకున్నప్పుడు పంటను తొలగిస్తా.

– వెంకటరామిరెడ్డి, నన్నారి రైతు, మామిళ్లపల్లి

నన్నారి ఎంతో మేలు



వేసవిలో గ్యాస్‌తో కూడిన కూల్ డ్రింక్స్ తాగడం వల్ల కడుపు ఉబ్బరంగా ఉంటుంది. దీంతో అన్నం ఆకలి కాదు. ధర్మవరంలో నన్నారి బాగా కలుపుతారు. నేను నన్నారిని ఎక్కువగా తాగుతుంటాను. నన్నారిని తాగడం ద్వారా కడుపులో చల్లదనంతో పాటు బాగా ఆకలి వేస్తుంది. బజారులో తక్కువ ధరకే నన్నారి లభిస్తుంది.

–ఓబిరెడ్డి, ధర్మవరం

క్లుప్తంగా

బ్రహ్మోత్సవాల నిర్వహణపై సమీక్ష


ఆలయ పీఠాధిపతి చెన్నారెడ్డితో మాట్లాడుతున్న డీఎస్పీ శివనారాయణస్వామి

గాండ్లపెంట: కటారుపల్లి విశ్వకవి యోగి వేమన ఆలయ పరిసరాలను గురువారం కదిరి డీఎస్పీ శివనారాయణస్వామి ఆలయ పీఠాధిపతులు చెన్నారెడ్డి, నందవేమారెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ నెల 6 నుంచి 4 రోజుల పాటు నిర్వహించే యోగి వేమన బ్రహ్మోత్సవాల నిర్వహణపై ఆలయ పీఠాధిపతులతో చర్చించారు. కదిరి రూరల్ సీఐ నాగేంద్ర, ఎస్‌ఐ వలీబాషా తదితరులు ఉన్నారు.

'ఉపాధి' ఏపీఓగా మంజుల



ఎన్పీకుంట: ఉపాధి హామీ ఏపీఓగా మంజుల గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నల్లచెరువు మండలంలో పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు. జాబ్‌కార్డు కలిగిన ప్రతి వేతనదారుడికి పని కల్పిస్తామన్నారు. కూలీలకు సకాలంలో వేతనం అందేలాకృషి చేస్తామన్నారు. అనంతరం ఉపాధిహామీ సిబ్బంది ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. కాగా ఇక్కడ విధులు నిర్వహించే ఏపీఓ చంద్రశేఖర్ బదిలీపై గాండ్లపెంటకు వెళ్లారు.

నల్లచెరువు ఏపీఓగా మంజునాథ

నల్లచెరువు: స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో ఏపీఓగా మంజునాథ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేస్తున్న మంజుల ఎన్పీకుంట మండలానికి బదిలీ అయ్యారు. ఇదిలా ఉండగా ఈసీగా సుబ్బారెడ్డి, టీఏలుగా రమేష్,అరుణ్, అంజనప్ప నూతనంగా బాధ్యతలు స్వీకరించినట్లు ఎంపీడీఓ రఘునాథ గుప్త తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం


పట్టుబడిన కర్ణాటక మద్యం చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

హిందూపురం టౌన్: అక్రమంగా తరలిపోతున్న 30 లీటర్ల కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ లక్ష్మీదుర్గయ్య గురువారం తెలిపారు. పట్టణంలోని సూగూరు గేట్ వద్ద ఉదయం అంబేడ్కర్ నగర్‌కు చెందిన ప్రసాద్ వర్మ అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై 288 కర్ణాటక మద్యం ప్యాకెట్లు (30 లీటర్ల మద్యం) తరలిస్తుండగా అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. సీఐ సునంద, ఎస్‌ఐలు సత్యనారాయణ, పృథ్వీ, ఫరూక్, నరసింహ, వెంకటేష్, అంజి, శివ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కాలనీల్లో పోలీసుల కార్డెన్ సెర్చ్


ఇంటిలో సోదాలుచేస్తున్న టూ టౌన్ సీఐ రెడ్డప్ప, పోలీసు సిబ్బంది

ధర్మవరం అర్బన్: పట్టణంలోని వైఎస్సార్ కాలనీ, ఇందిరమ్మకాలనీ, కేతిరెడ్డి కాలనీ ఎల్1, ఎల్2, ఎల్3, ఎల్4 కాలనీల్లో గురువారం ఉదయం టూ టౌన్ సీఐ రెడ్డప్ప ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. కాలనీల్లో ఉండే రౌడీషీటర్లు, అనుమానాస్పద వ్యక్తుల ఇళ్లు, నిరంతరం గొడవలకు పాల్పడే వారి ఇళ్లల్లో క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. అనంతరం వార్డు ప్రజలతో సీఐ మాట్లాడుతూ కాలనీల్లో ప్రజలంతా ఐకమత్యంగా ఉండాలన్నారు. ఎవరైనా గొడవలకు పాల్పడినా, ఎవరైనా గొడవలు సృష్టించాలని చూసినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

సత్ప్రవర్తనతో మెలగండి


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ శివనారాయణస్వామి

కదిరి టౌన్: సత్ప్రవర్తనతో మెలగాలని డీఎస్పీ శివనారాయణస్వామి రౌడీషీటర్లను హెచ్చరించారు. గురువారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ గొడవలకు దూరంగా ఉండి ప్రశాంతంగా జీవించాలన్నారు. శాంతిభద్రతలకు భంగం వాటిల్లేలా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐ వి.నారాయణరెడ్డి, ఎస్‌ఐ బాబ్జాన్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పుట్టపర్తిలో వైఎస్సార్‌సీపీ సమావేశం

పుట్టపర్తి: పుట్టపర్తి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం కొత్తచెరువు మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి తెలిపారు. సాయంత్రం 3–30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. సమావేశానికి మండలంలోని అన్ని గ్రామాల నుంచి పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయన కోరారు.

అమడగూరులో రేపు..

అమడగూరు: మండల కేంద్రం అమడగూరులోని చౌడేశ్వరీకల్యాణ మండపంలో శనివారం ఉదయం 9 గంటలకు వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ కన్వీనర్ సూర్యనారాయణరెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి హాజరవుతారన్నారు. మండల వ్యాప్తంగా ఉన్న వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులు, శ్రేణులు పెద్దఎత్తున హాజరు కావాలని కోరారు.

ఓడీచెరువు: మండల కేంద్రంలోని షాదీమహల్‌లో శనివారం వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ రాజునాయుడు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి హాజరవుతారన్నారు. ఉదయం 11 గంటలకు జరిగే సమావేశానికి పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు పెద్దసంఖ్యలో తరలిరావాలని కోరారు.

6న కంటి మెగా వైద్య శిబిరం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని షిర్డీసాయిబాబా ఆలయంలో ఈనెల 6వతేదీ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ఉచిత కంటి మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఈమేరకు షిర్డీసాయిబాబాసేవా సమితి సభ్యులు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. కడపలోని పుష్పగిరి కంటి ఆసుపత్రి వైద్యులు ఉచితంగా కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి ఆపరేషన్లు నిర్వహిస్తారని తెలిపారు. కంటి సమస్య ఉన్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఘనంగా గంగమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట


గంగమ్మకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు

పుట్టపర్తి రూరల్: రాయలవారిల్లిలో గంగమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం ఘనంగా జరిగింది. రాఘవేంద్రశర్మ రుత్వికుల బృందం గణపతి పూజ, నవగ్రహ పూజ, అష్టదిక్పాలకుల పూజలు, సర్వదేవత ఆవాహన, రుద్రావాహన, గంగాదేవి ఆవాహన చేపట్టారు. అనంతరం శాస్త్రోక్తంగా అమ్మవారి విగ్రహానికి ప్రాణప్రతిష్ట నిర్వహించారు. అటవీ ప్రాంతానికి ఆనుకుని ఉన్న రాయలవారిపల్లి గ్రామం మీదుగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో ఎన్‌హెచ్ 342 నిర్మాణం జరిగింది. సదరు గ్రామానికి చెందిన మాదినేని పాపన్న, దారపనేని పోతన్న కుటుంబ సభ్యుల భూములకు మంచి పరిహారం అందింది. సుమారు రూ.6లక్షలకుపైగా ఖర్చు చేసి ఆలయాన్ని నిర్మించినట్లు ధర్మకర్తలు తెలిపారు. మాదినేని చెన్నకృష్ణ, దారపునేని జయచంద్ర చౌదరి, మురళీ తదితరులు ముందుండి కార్యక్రమం నిర్వహించారు. వేలాది మంది భక్తులకు అన్నదానం చేపట్టారు.

బార్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక


బార్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులు

ధర్మవరం అర్బన్: స్థానిక బార్ అసోసియేషన్ కార్యాలయంలో గురువారం నూతన కమిటీ ఎన్నిక జరిగింది. బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పదవికి న్యాయవాదులు డీఎల్‌ఎన్ మూర్తి, కెసి చంద్రమౌళి పోటీపడ్డారు. మొత్తం 67 ఓట్లు పోలవగా డీఎల్‌ఎన్‌మూర్తికి 36 ఓట్లు పడగా కెసి.చంద్రమౌళికి 31 ఓట్లు వచ్చాయి. దీంతో 5 ఓట్ల మెజారిటీతో డీఎల్‌ఎన్ మూర్తి ప్రధాన కార్యదర్శిగా విజయం సాధించారు. అనంతరం నూతన కమిటీని సీనియర్ న్యాయవాదులు ఎంపిక చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎం ఏ ఖరీమ్, ఉపాధ్యక్షుడిగా నూర్ మహమ్మద్, సహాయ కార్యదర్శిగా బాలసుందరి, కోశాధికారిగా అబ్దుల్ సాబ్, కమిటీ సభ్యులుగా కెఎం రేష్మ, శివ కుమార్, మోహన్ ప్రసాద్, నరసింహమూర్తి, పెద్దన్న, బాబా ఫకృద్దీన్, ప్రసాద్, మణికంఠను ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులకు సీనియర్, జూనియర్ న్యాయవాదులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు ఖరీమ్ మాట్లాడుతూ న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. ప్రధాన కార్యదర్శి డీఎల్‌ఎన్ మూర్తి మాట్లాడుతూ ఏడాదిపాటు న్యూస్‌పేపర్, తాగునీటి వసతిని బార్ అసోసియేషన్‌కు తన సొంత ఖర్చులతో ఏర్పాటు చేస్తానని తెలిపారు.

మద్దెలచెరువు ఎద్దులకు అంతర్రాష్ట్ర బహుమతి


అంతర్రాష్ట్ర బహుమతి సాధించిన ఎద్దులతో రైతులు, గ్రామస్తులు

కనగానపల్లి: మండలంలోని మద్దెలచెరువు గ్రామానికి చెందిన ఎద్దులు అంతరాష్ట్ర ఎద్దుల బండి పరుగు పోటీల్లో బహుమతి సాధించాయి. కర్ణాటక రాష్ట్రం చెళ్లికెరలో బుధ, గురువారాల్లో అంతర్రాష్ట్ర ఎద్దుల బండి పరుగు పోటీలు నిర్వహించారు. ఇందులో మద్దెలచెరువు గ్రామానికి చెందిన రైతు కురాకులపల్లి అంజినప్పకు చెందిన ఎద్దులు పాల్గొన్నాయని స్థానికులు తెలిపారు. ఈ పోటీల్లో బాగా రాణించిన ఆ ఎద్దులు రెండవ స్థానంలో నిలిచాయని తెలిపారు. రైతు అంజినప్పకు నగదు బహుమతి, సిల్వర్ మెడల్ అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక రైతులు, గ్రామస్తులు ఆ ఎద్దులను గ్రామంలో ఊరేగించారు.

నాణ్యమైన ఆహారం అందించాలి


ఆసుపత్రి క్యాంటీన్‌లో ఆహారాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి రామచంద్ర తదితరులు

ధర్మవరం: రోగులు, ప్రజలకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి రామచంద్ర క్యాంటీన్ నిర్వాహకులను ఆదేశించారు. పట్టణంలోని స్పందన ఆసుపత్రిలోనున్న క్యాంటీన్‌ను గురువారం తనిఖీ చేశారు. అక్కడ వండుతున్న ఆహారాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారి మాట్లాడుతూ భోజనంలో నాణ్యత ఎక్కడైనా లోపిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం రోగులతో మాట్లాడి భోజన నాణ్యతపై ఆరా తీశారు. ఆరోగ్యశ్రీ అమలవుతున్న ప్రైవేటు ఆసుపత్రుల్లో డైట్ కాంట్రాక్టర్లు అందిస్తున్న భోజనాన్ని పరిశీలిస్తున్నామని తెలిపారు.

'చలో విజయవాడ'కు అనుమతివ్వాలి


కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

ధర్మవరం: చలో విజయవాడ కార్యక్రమానికి మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు అనుమతి ఇవ్వాలని మున్సిపల్ కార్యాలయంలో గురువారం మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్‌కు సీఐటీయూ నాయకులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ జేవి రమణ, కో–కన్వీనర్ టి.అయుబ్‌ఖాన్, కార్మిక సంఘం అధ్యక్షుడు ఎం.బాబు, కార్యదర్శి ముకుంద, లక్ష్మి ఓబులేసు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పారిశుధ్య కార్మికులకు ఆప్కాస్ పద్ధతిని రద్దు చేసి కాంట్రాక్టు విధానం అమలు చేయాలనే ఆలోచనను విరమించుకోవాలని లేకపక్షంలో కార్మికులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా కార్మికులు రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రికి వినతిపత్రం ఇవ్వడానికి విజయవాడ వెళ్లడానికి అనుమతి ఇవ్వాలని కోరారు. కార్మిక సంఘం నాయకులు చెన్నకేశవులు, ప్రసాద్, ఓబులప్ప పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


పుట్టపర్తి డిపో ఎదుట ఎర్రబ్యాడ్జిలతో నిరసన తెలియజేస్తున్న నాయకులు


కదిరిలో ఎర్రబ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేస్తున్న ఉద్యోగులు

పుట్టపర్తి టౌన్: ఆర్టీసీ ఉద్యోగుల అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం రెండో రోజూ ఎర్రబ్యాడ్జిలు ధరించి డిపో ఎదుట నిరసన తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగ భద్రతపై కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన సర్క్యులర్‌ను అమలు చేయాలన్నారు. అన్ని కేటగిరీల్లో పదోన్నతులు కల్పించి ఖాళీలు భర్తీ చేయాలన్నారు. విద్యుత్ బస్సులు కొనుగోలు చేసి నిర్వహణ బాధ్యత ఆర్టీసీ సిబ్బందికే ఇవ్వాలన్నారు. అన్ని గ్యారేజీలో సమస్యలు పరిష్కరించాలని కోరారు. యూనియన్ జిల్లా రీజనల్ అధ్యక్షుడు శ్రీరాంనాయక్, కార్యదర్శి షబ్బీర్, ఉపాధ్యక్షురాలు తిరుపతమ్మ, డిపో చీఫ్ అడ్వైజర్ అప్పిరెడ్డి, ప్రెసిడెంట్ శివశంకర్, కార్యదర్శి గంగులయ్య, ట్రెజరర్ శివారెడ్డి, జాయింట్ సెక్రటరీ విజయలక్ష్మి, నాయకులు జనార్దన్, స్వర్ణమ్మ, చంద్ర, నాగరాజు, కవిత, మానస తదితరులుపాల్గొన్నారు.

కదిరి అర్బన్: ఉద్యోగ భద్రత సర్క్యులర్ కొనసాగింపుపై యాజమాన్య వైఖరికి నిరసనగా స్థానిక ఆర్టీసీ డిపోలో నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు గురువారం రెండో రోజూ ఆందోళన కొనసాగించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సంస్థలో కండక్టర్లు, డ్రైవర్లపై విధిస్తున్న శిక్షలు ఏ ప్రభుత్వ ఉద్యోగికి లేవన్నారు. జీఓ 19ని తక్షణం అమలు చేసి లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే అక్రమ బదిలీలు ఆపాలని, నూతన బస్సులు తెప్పించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు అజీజ్, శ్రీనివాసులు, చలపతి, నరసింహులు, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థిని అదృశ్యం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని బెస్తవీధికి చెందిన ఇంటర్ విద్యార్థిని బెస్త జాహ్నవి అదృశ్యమైంది. వివరాలు..జాహ్నవి బుధవారం తన స్నేహితురాలు ఇంటికి వెళతానని చెప్పి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు తెలిసిన చోటల్లా వెతికినా ఆచూకీ లభించలేదు. గురువారం విద్యార్థిని తల్లి రాజేశ్వరి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు వన్ టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

తాడిమర్రి: మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎంపీడీఓ వెంకటరంగారావు గురువారం ప్రారంభించారు. ఈఓఆర్డీ విజయ్ భాస్కర్‌నాయుడు, సర్పంచ్ బాలమ్మ, పంచాయితీ కార్యదర్శి రిజ్వాన్ బేగం తదితరులు పాల్గొన్నారు.

నల్లచెరువు: మండల కేంద్రంలోని సచివాలయం –1 వద్ద ఎంపీడీఓ రఘునాథగుప్త, సర్పంచ్ పంచరత్నమ్మ బీజేపీ మనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఇంతియాజ్ అహ్మద్ ఆధ్వర్యంలో గురువారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. సర్పంచ్ మాట్లాడుతూ వేసవిలో కార్యాలయానికి వివిధ పనులపై గ్రామాల నుంచి వచ్చే ప్రజల దాహం తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఏఓ రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి నరేష్, ఉత్తన్న, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నిందితుడికి యావజ్జీవం

పావగడ: బాలికపై అత్యాచారం కేసులో నిందితుడు శ్రీరామ్‌కు తుమకూరు పోక్సో ప్రత్యేక కోర్టు యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. అదే విధంగా రూ.1.50 లక్షల జరిమానా విధించింది. తాలూకాలోని అరసికెరె పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన సంఘటన వివరాలిలా ఉన్నాయి.. 2024లో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఓ బాలిక రంగోలి తీసుకు రావడానికి లింగదహళ్లికి వెళ్తుండగా .. అదే మార్గంలో శ్రీరామ్ అనే వ్యక్తి ద్విచక్ర వాహనంలో వెళ్తూ.. బాలికకు మాయమాటలు చెప్పి బైక్‌లో కూర్చోపెట్టుకున్నాడు. కొంచెం దూరం వెళ్లాక దారి మళ్లించి లింగదహళ్లి బయలు ప్రదేశానికి వెళ్లి ఆ బాలికపై అత్యాచారం చేశాడు. ఫిర్యాదు మేరకు నిందితుడు శ్రీరామ్‌ను అరసికెరె పోలీసులు అరెస్ట్ చేసి పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. సంఘటనపై విచారణ చేసిన రూరల్ సీఐ గిరీశ్ దోషారోపణలను కోర్టుకు సమర్పించాడు. ఆరోపణలు రుజువు కావడంతో నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష (మరణించేంత వరకూ) విధించింది. దీంతో పాటు రూ 1.50 జరిమానా విధించింది. అలాగే బాధిత బాలికకు జిల్లా న్యాయ సేవా ప్రాధికార సమితి నుంచి రూ.8 లక్షలు పరిహారం అందివ్వాలని ఆదేశించింది. ఈ కేసును ప్రభుత్వం తరఫున ఏపీపీ హనుమంతరాయ తళికేరి వాదించాడు.

ఎన్‌ఎంఎంఎస్‌కు మోడల్‌స్కూల్ విద్యార్థులు


ఎంపికైన మోడల్‌స్కూల్ విద్యార్థినులు

పుట్టపర్తి అర్బన్: ఇటీవల నిర్వహించిన ఎన్‌ఎంఎంఎస్(నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్)కు జగరాజుపల్లి వద్దనున్న మోడల్‌స్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రమేష్‌బాబు గురువారం తెలిపారు. పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న తన్మయిశ్రీ, పూజ ఎంపికయ్యారని, వీరికి ఏడాది కి రూ.12 వేలు చొప్పున 4 ఏళ్ల పాటు స్కాలర్‌షిప్పు అందనుందన్నారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ విద్యార్థులతోపాటు శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులు సురేఖ, ఫర్జానాను అభినందించారు.

కుట్టుమిషన్ అందజేత


కుట్టుమిషన్ అందిస్తున్న సీఐ సునీత, దాతలు

పుట్టపర్తి టౌన్: స్థానిక అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఖిద్మత్ ఏ ఖల్క్ చార్టిబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సీఐ సునీత కొత్తచెరువు మండలం తలమర్ల గ్రామానికి చెందిన నిరుపేద మహిళ శ్వేతకు ఉచితంగా కుట్టుమిషన్ అందజేశారు. శ్వేత భర్త రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈమెకు ఇద్దరు కుమార్తెలున్నారు. ఆమె కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న ఖిద్మత్ ఏ ఖల్క్ చార్టిబుల్ ట్రస్ట్ సభ్యులు దాతల సహకారంతో కుట్టుమిషన్ అందజేశారు. కార్యక్రమంలో శ్రావణి, అలీ, సమీర్, రామాంజనేయులు, యాసిన్, జావిద్, గోపి, ఎస్‌ఐ మధు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా చౌడేశ్వరీదేవి గ్రామోత్సవం

అమడగూరు: అమడగూరులో ప్రసిద్ధిగాంచిన చౌడేశ్వరీదేవి ఉత్సవాల్లో భాగంగా కొలిమిరాళ్లపల్లిలో గురువారం గ్రామోత్సవం ఘనంగా జరిగింది. ఈసందర్భంగా యువకులు అమ్మవారి పల్లకీని ఎత్తుకుని డప్పు, వాయిద్యాల నడుమ ఊరేగించారు. ప్రతి ఇంటి ముందు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే గతేడాది మొక్కుకున్న వారు ఈ ఊరేగింపులో మొక్కులు చెల్లించుకున్నారు. వడివేలును సమర్పించారు. ఊరేగింపు, పూజల అనంతరం అమ్మవారిని సోలుకుంట్లపల్లికి తీసుకెళ్లారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

తనకల్లు: గంగసానివారిపల్లి సమీపంలోని 42వ జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు అగ్రహారానికి చెందిన ప్రసాద్ తన కుటుంబ సభ్యులతో కలిసి కదిరి నుంచి కారులో స్వగ్రామానికి బయలుదేరాడు. అయితే గ్రామం వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న లారీ కారును ఢీ కొంది. ఈ ప్రమాదంలో ప్రసాద్‌కు భుజం, తలకు తీవ్ర గాయాలు కాగా సాయికృష్ణ అనే వ్యక్తి స్వల్పంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు చికిత్స కోసం క్షతగాత్రులను స్థానిక 30 పడకల ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం ప్రసాద్‌ను కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు.